


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

10

(అక్టోబర్ ౩ '76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

## ***దసరా పండుగ విశేషం***

**దసరా చాలా పస గల పండగ అంటారు.** ముసలితనాన్ని మూడు పల్టీలు కొట్టించే పండుగ అంటారు కొందరు. దీనిమీద సామెతలు కూడా ఏర్పడ్డాయి. కాలం చల్లగా ఉంటుంది. మనస్సు ఉల్లాసంగా ఉంటుంది. పిల్లలు విల్లంబులూ, కోతి బొమ్మలతో ఆడుగుకుంటూ ఉంటారు. అవి కొని పారేస్తే కొంపలో అట్టే గల్లంతు ఉండదు.

ఇల్లాళ్ళు వేడుకగా కాలం గడుపుతూ ఉంటారు. మగరాయుళ్ళు - పల్లెటూళ్ళలో అయితే - వ్యవసాయం పనులు పూర్తి చేసుకుని - సంవత్సరం పొడవునా దాచుకున్న 'క్యాజుయల్ లీవు' వాడుకుంటూ ఉంటారు. వ్యక్తుల్లో ఏదో తాజాతనం వస్తుంది. కొందరిలో మోజులు కూడా మోసులెత్తుతూ ఉంటాయి. అందుకనే అన్నారేమో దసరా చాలా పస గల పండగ అని. పల్లెటూళ్ళలో పూర్వం - దసరా వేడుకలు ఎక్కువగా ఉండేవి. ముఖ్యంగా పిల్లలకు అంతులేని ఆనందం, పంతుళ్ళు దసరా పాటలు, పద్యాలు నేర్పడం.. పండుగ రోజుల్లో - ఇంటింటికీ తీసుకుపోవడం.. పిల్లలచేత 'జయాభి జైభవా' అనిపించడం.. ఇదంతా ఎంతో ఆనందంగా ఉంటుంది - ఉండేదు మరి!

'ధర సింహాసనమై నభంబు గొడుగై' అన్న పద్యం విని మా ఊళ్ళో ఉండే చిన్న కరణంగారు "పతి లంబోధరుడై, సుతుండు బడుగై, ప్రారబ్ధ మాసాంతమై" అంటూ పారడీ వ్రాసి చదువుతూ ఉండేవాడు. 'అదేమిటండీ! కరణంగారూ! అలాటి దైవ వర్ణన నిలా మారుస్తారు? తప్పుకాదా?" అంటే - 'పద్యం మారిస్తే ఆయన రూపం మారుతుందా?.. మన సంసార లక్షణాలు కొన్నిటిని చందస్సులో బిగించి అట్టి పెడదామనే గానీ - ఆ పరమాత్ముని పరిహాసం చెయ్యాలని కాదు సుమండీ' అనేవాడు.

దసరాకు సంబంధించిన విశేషాలు కూడా కొన్ని నిత్యకృత్యంలో వాడకానికి వచ్చినాయి. ఇంకా రావచ్చు కూడా "ఆ పడుచుపిల్ల బుగ్గ లెప్పుడూ బుక్కాయి కొట్టినట్లుంటాయి... చేసుకున్న వాడి అదృష్టం' అంటూ ఉంటారు.

ఒక బీద ఇల్లాలు అంటుంటే విన్నాను - 'ఆయనకు ఉన్నదదే ఒక్క తెల్ల చొక్కా... ఉతుక్కు వేస్తే దాన్నిండా బుక్కాయ రంగు చేసుకువచ్చాడు రజక సోదరుడు... దాచుకుని దసరాలో తొడుక్కోండి ఏం చేస్తాం అన్నాను'.

తెల్లచొక్కా తొడుక్కుని భర్త దేదీప్యమానంగా వెలుగుతుంటే చూడాలని ఆవిడ ఎంతో ఉవ్విళ్ళూరి ఉంటుంది. కానీ అదృష్టవశాత్తు ఆ చొక్కాకు బుక్కాయి రంగు అంటడం వల్ల అది ప్రత్యేకించి 'దసరా ముస్తాబు' క్రింద వాడమని పురమాయించడంలో ఆమె అభిలాష కొంతవరకు నెరవేరే అవకాశం లభించింది.

ఎవరైనా కొత్తగా కాపురానికి వచ్చిన పిల్లల్ని గురించి పెద్దవాళ్ళు వర్ణించి చెప్పేటప్పుడు.. "పిల్లకేం రంగు రంగుల విల్లంబల్లే ఉంది. పిల్లలో లోపంలేదు - వంచే తాడు మంచిదై ఉండాలి.. బుట్టలో గులాం ఎప్పటి కప్పుడు మంచిది నింపాలి.. బుట్టదేం ఉంది? గులాం జిమ్మమంటే గులాం జిమ్ముతుంది - పేలపిండి జిమ్మమంటే ఆ పిండే జిమ్ముతుంది' అంటూ వర్ణిస్తారు.

భర్తను తన చెప్పుచేతల్లోకి తెచ్చుకుని, తన ఇష్టప్రకారం నడిపించుకోవడం నేర్చిన ఇల్లాల్ని గురించి ముచ్చటిస్తూ 'ఆయనదేం ఉంది. వట్టి దసరా కోతిబొమ్మ. తాడెంత విసురుగా లాగితే అంత విసురుగా ఆడతాడు. గడ చిన్నదైందిగానీ - ఆవిడగడుసుతనం పెద్దదే కాళ్ళూ చేతులూ కట్టి ఉంటాయి. ఆ తాళ్ళు బద్దకు చుట్టీ ఉంటాయి. ఇంకెక్కడికి పోతాడు?.. ఆ జానెడు దూరంలోనే - జై భార్యామణి, జై ప్రాణేశ్వరీ అంటూ ఎగురుతూ ఉంటాడు' అని చెప్పుకుంటారు.

'ఆ ముందు భాగంలో ఉన్న కాంతమ్మగారు ఎప్పుడైనా వచ్చిందంటే వరసాగ్గా నాలుగు గంటలు మాట్లాడుతుంది. ఒక్క క్షణం వదలదు.. తనకు వచ్చిన మాటలో ఒక్కటీ వదలదు.... అదేం ఖర్మమో.. దసరా ముసురు పట్టినట్లు పడుతుందనుకోండి.. మన మనస్సులు తడిసి ముద్దయినా పిడిచి ఎండవేస్తానంటుంది గానీ - అవతలకు మాత్రం పోదు... మాకు వారానికో రెండు దసరా ముసుర్లు' అంటూ ఉంటారు.

కాలం మారింది గనక దసరా పాటలు కూడా కొంచెం మార్చడం మంచిది. బడిపంతుళ్ళు అంటే పూర్వం ఒక్క పల్లెటూరివారికే అంకితమయేదా మాట! ఇప్పుడు కాలేజీలక్కూడా అన్వయిస్తోంది. ఆ దృష్టితో

"అయ్యావారికి చాలు
అయిదు వరహాలు
పిల్లవాళ్ళకు చాలు
పప్పు బెల్లాలూ -

అనే పాటను ఈ క్రింది విధంగా మార్చుకోవచ్చు.

"అయ్యగార్లకు చాలు
యు.జి.సి.స్కేళ్ళు,
పిల్లవాళ్ళకు చాలు
ఫ్రీ ఎంటరెన్సులు -

ఇలా పాటలన్నీ మార్చుకుని దసరా క్కూడా మనం క్రొత్త తనం కలిపించవచ్చు. కాలం చాలా వడిగా నడుస్తోంది. మరి పాతతనాన్ని రవంత మార్చకపోతే ఎలా!

ఈ కాలంలో మన జాతీయంగా అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నాం. కనుక అన్నిటినీ తలచి జయాభి జైభవా! విజయీభవా' అనుకోవచ్చు. పోతే తక్కువ సంతానం విషయంలోనే క్రొత్తపాటలు వ్రాయాలి.

"ముగ్గురైతే చాలు
ముద్దు బిడ్డల్లు...
చక్కగా మెరిసేను
పసిడి విల్లంబుల్లు...
కోతి బొమ్మలు మాకు
వద్దు వద్దండీ.

కోదండ పాణుల్లు
కొద్దిమందే చాలు...
వరలక్ష్మి దేవతా
ఒకతయినా చాలు...
అధిక సంతానమ్ము కోరేది లేదు.
ఆర్థిక క్షోభమ్ము పొందేది లేదు.
తక్కువ సంతతి - మ్రొక్కేము మేము
చక్కన్ని గృహములు నిలిపేము మేము జయాభి జై భవా
దిగ్విజైభవా.

●●●

Comment on this article..